క్లుప్తంగా

చదువే జీవితానికి వెలుగు



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసిన షాలోమ్ బ్రదరన్ చర్చి సభ్యులు

కుందుర్పి: చదువే జీవితానికి వెలుగని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ వెంకటస్వామి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మలయనూరులో షాలోమ్ బ్రదరన్ చర్చి పాస్టర్ నగేష్, సభ్యుల ఆధ్వర్యంలో సుమారు 700 విద్యార్థులకు పుస్తకాలు, వాటర్ బాటిల్స్‌తో కూడిన కిట్లను పంపిణీ చేశారు. సమాజంలో విలువలతో కూడిన జీవితంపై విద్యార్థులకు వివరించారు. చదువు ప్రాముఖ్యతను తెలియజేశారు. ఇతరులకు సహాయం చేయడం విద్యార్థి దశ నుంచి అలవరుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్లు డానియెల్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ

రాయదుర్గంటౌన్: మహిళలు చట్టాలతో పాటు వారి రక్షణ కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సౌకర్యాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ విద్యార్థి యువజన, మహిళా సంఘాల ఆధ్వర్యంలో మహిళలపై దాడులను అరికట్టాలి, బాల్య వివాహాలను నిర్మూలించాలి అనే అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. ఇన్‌చార్జ్ తహసీల్దార్ రఘు, సీపీఐ కార్యదర్శి నాగార్జున, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయక కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం పెను ప్రమాదం తప్పింది. వివరాలు.. పెట్రోల్ బంక్ నుంచి ఓ వ్యక్తి పెట్రోల్ తీసుకెళ్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ క్యాన్ పగిలిపోవడంతో పెట్రోల్ నేలపాలైంది. ఇది గమనించని ఓ వ్యక్తి అక్కడ బీడీ వెలిగించుకుని అగ్గిపుల్లను కింద పడేశాడు. ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రోడ్డు పక్కన ఉన్న ద్విచక్ర వాహనాలకు మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన పరిసర దుకాణాల యజమానులు నీళ్లు చల్లి మంటలను అదుపుచేశారు. స్థానికులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వటంతో ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం పర్యటన



పూర్వ విద్యార్థులతో న్యాక్ బృందం సభ్యులు

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం న్యాక్ బృందం చైర్మన్ ఆచార్య లింబాద్రి, మెంబర్ కో–ఆర్డినేటర్ ఆచార్య బుడిన గోగాయ్ సందర్శించారు. ఈ సందర్భంగా గత ఐదేళ్లలో కళాశాల ప్రగతిపై సిద్ధం చేసిన రికార్డులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కళాశాల ప్రిన్సిపాల్ జయరాంరెడ్డి వివరించారు. అనంతరం పూర్వ, ప్రస్తుత విద్యార్థులతో న్యాక్ సభ్యులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఏసీ కో–ఆర్డినేటర్ సూర్యనాగిరెడ్డి, సీపీడీసీ మల్లికార్జున, దేశం శ్రీనివాసులు, అధ్యాపకుడు శ్రీధర్ పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపొద్దు



మాట్లాడుతున్న రిడ్స్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు

బ్రహ్మసముద్రం: హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులపై వివక్ష చూపి, వారిని మానసిక ఒత్తిడికి గురి చేయొద్దని రిడ్స్ స్వచ్ఛంధ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎయిడ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కుమ్మేసిన వాన

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో వర్షం కుమ్మేసింది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. పలు చోట్ల పంటలకు నష్టం వాటిల్లింది.

- రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో భారీ వర్షం
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం

రాయదుర్గం: పట్టణంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ వాన దంచి కొట్టింది. రాయదుర్గంలో 85.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పట్టణంలోని కొలిమివీధి, మధుటాకీస్, ముత్రాస కాలనీ, గ్యాస్‌గోడౌన్ ప్రాంతాల్లోని వందలాది ఇళ్లు జలదిగ్బంధంలోకి చిక్కుకున్నాయి. లక్ష్మిబజార్‌లో వ్యాపార సముదాయాల్లోకి వరదనీరు ప్రవేశించాయి.దీంతో భారీ నష్టం వాటిల్లింది. పలు ప్రభుత్వ కార్యాలయాలన్నీ వర్షం నీటిలో చిక్కుకున్నాయి. ముంపు ప్రాంతాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, ఆయా వార్డుల కౌన్సిలర్లు, పార్టీ ఇన్‌చార్జులు పర్యటించి సహాయ చర్యలు చేపట్టారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ముంపుప్రాంతాల్లో శాశ్విత పరిష్కారం కోసం గత ప్రభుత్వం మంజూరుచేసిన రూ.20 కోట్ల నిధులను కూటమి ప్రభుత్వం సకాలంలో అందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

బొమ్మనహాళ్: మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి వర్షం దంచికొట్టింది. ఏకధాటిగా రెండు గంటలకు పైగా కుంభవృష్టి కురిసింది. 31.4 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కొలగానహళ్లి వద్ద కబ్బాల్ వంక, కందేపల్లి వద్ద వేదావతి, ఉద్దేహాళ్ వద్ద వేదావతి హగరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

రాయదుర్గంటౌన్: భారీ వర్షం కారణంగా పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో భారీగా వర్షపు నీళ్లు చేరాయి. నీళ్లు బయటకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో పాటు ప్రధాన డ్రైనేజీ నిండిపోయి నీరంతా ఆవరణంలోకి ప్రవేశించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కణేకల్లు: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలతో 'వేదవతి హగిరి' పరవళ్లు తొక్కుతోంది. ఐదు అడుగుల ఎత్తులో వరదనీరు ప్రవహిస్తున్నాయి. మంగళవారం రాత్రి కళేకుర్తి, ఆదిగానిపల్లి, పెనలకపాడు, తగ్గుపర్తి, రాంసాగరం, కొకుంట్ల, బూదవర్తి, కె.కొత్తపల్లి, రచ్చుమర్రి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.

జలదిగ్బంధంలో 'పెనకలపాడు'

కణేకల్లు: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పెనకలపాడు గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఊరికి దక్షిణం వైపు అంటే బెలుగుప్ప వెళ్లే మార్గంలో పెద్ద వంక ఉండగా... ఉత్తరాన సొల్లాపురం వెళ్లే దారిలో చిన్న వంక ఉంది. వరుస వర్షాలతో రెండు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బుధవారం ఉదయం కళ్యాణదుర్గం – ఉరవకొండ, బెలుగుప్ప– అనంతపురం బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బెలుగుప్ప వైపు వెళ్తున్న ఓ టిప్పర్ పెద్ద వంకలో ఇరుక్కుపోయింది. స్థానికులు డ్రైవర్‌ను చాకచక్యంగా బయటికి తీసుకొచ్చారు.

బెళుగుప్పలో కుండపోత వర్షం

బెళుగుప్ప: మండలంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు కుండపోత వర్షం కురిసింది. 89.8 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షానికి బెళుగుప్ప నుండి ఉరవకొండకు, బెళుగుప్ప నుంచివయా తగ్గుపర్తి మీదుగా అనంతపురం వెళ్లే ప్రధాన రహదారుల్లో రాకపోకలు నిలిచిపోయాయి. హనకనహాల్ వద్ద పెద్దవంకలో ఉరవకొండ నుంచి బెళుగుప్పకు వస్తూ వున్న టిప్పర్ వరద ఉధతికి కొట్టుకుని పోయి గుంతల్లో నిలిచింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. మండలవ్యాప్తంగా సుమారు 95 మంది రైతులు 300 ఎకరాల్లో పంటలు నష్టపోయారని ఏఓ పృథ్వీసాగర్ పేర్కొన్నారు. అలాగే 70 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిని సుమారు రూ.60 లక్షల పైగా పంట నష్టం వాటిల్లిందని హెచ్ఓ కృష్ణతేజ తెలిపారు.

కూడేరు: తిమ్మాపురం, చోళసముద్రం, పి.నాగిరెడ్డి పల్లి, కొర్రకోడు, ఉదిరిపికొండ, జల్లిపల్లి, జయపురం, కూడేరుతో పాటు మరికొన్ని గ్రామాల్లో బుధవారం వేకువ జాము వరకు భారీగా వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లోని చెక్‌డ్యాంలు వర్షం నీటితో నిండాయి. వంకలు పారాయి. టమాట, బ్యాడిగ మిర్చి, వరి, ఆముదం పంటలు వర్షం నీటితో మునిగిపోయాయి. ఇదిలా ఉండగా ఉపాధి హామీ కార్యాలయంలో వర్షపునీటితో కార్యకలాపాలు స్తంభించిపోయాయి. భవనం పాతది కావడంతో పైకప్పు దెబ్బతింది. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి వర్షం నీరు గదుల్లోకి దిగుడంతో కంప్యూటర్లలోకి దిగాయి. దీంతో కంప్యూటర్లు పని చేయలేదు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అధికంగా గదుల్లోకి నీరు దిగడంతో రికార్డులు తడిశాయి.

చెరువులకు జలకళ..

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని చాపిరి, ముదిగల్లు చెరువులు వర్షపు నీటితో నిండుకుండలా మారాయి. ముదిగల్లుకు చెందిన రైతు గోపాల్ సాగు చేసిన ముడు ఎకరాల టమాట పంట నీటి మునిగింది. అదే గ్రామానికి చెందిన రైతు రామాంజనేయులు సాగు చేసిన కర్బూజ పంట నీట మునిగింది. ఒంటిమిద్ది ఎస్సీ కాలనీలో వర్షపు నీరు చేరడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు.

పొంగిపొర్లిన వాగులు వంకలు

బ్రహ్మసముద్రం: మండల వాప్తంగా గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు నీటితో పొంగి పొర్లుతున్నాయి. భైరసముద్రం, పోలేపల్లి, చెలిమేపల్లి, సంతే కొండాపురం చెరువులకు జలకళ సంతరించుకుంది. భైరసముద్రం, పోలేపల్లి చెరువులు పూర్తిగా నిండి నిండుకుండను తలపిస్తున్నాయి. కర్ణాటక ప్రాంతంలో వర్షాలు అధికంగా కురుస్తుండంటంతో వేదవతి హగరి నదీ పరవళ్లు తొక్కుతోంది.

వజ్రకరూరు: మండలంలో బుధవారం తెల్లవారుజామున వర్షం దంచికొట్టింది. మండల కేంద్రంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. తట్రకల్లు నుంచి పందికుంటకు వెళ్లె రహదారిపై వర్షపునీరు భారీగా రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కమలపాడుతండాలో రమేష్ నాయక్, నారాయణనాయక్ అనే రైతులకు చెందిన ఆరు ఎకరాల్లో కందిపంట కొట్టుకుపోయింది. ఏఓ మధుకర్, సిబ్బంది పంటను పరిశీలించారు. వెంకంటాంపల్లి, వెంకటాంపల్లిపెద్దతాండా వరినాట్లు కొట్టుకుపోయినట్లు రైతులు వాపోయారు.



కణేకల్లు మండలం పెనకలపాడు శివారులో పెద్దవంకలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

ముంపుకాలనీలో అల్పాహారం పంపిణీ

రాయదుర్గంటౌన్: భారీ వర్షంతో బుధవారం పట్టణంలోని కొలిమివీధి, రామస్వామివీధి, పాత మీసేవా ప్రాంతాలు ముంపునకు గురయ్యారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా మక్కా మసీదు యూత్ ఆర్గనైజింగ్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ ఆధ్వర్యంలో మౌలీసాబ్‌లు ముదస్సిర్, జుబేర్, ఎయిర్‌టెల్ అఫ్రోజ్ తదితరులు టిఫెన్ ప్యాకెట్లు , పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

నష్ట నివారణ చర్యలు చేపడతాం

వర్షం కారణంగా దెబ్బతిన్న ఇళ్లు, వ్యవసాయ, ఉద్యాన పంటలకు కొన్నిచోట్ల నష్టం వాటిల్లింది. అధికార యంత్రాగాన్ని క్షేత్రస్థాయి పర్యటనకు పంపి నష్ట నివేదికలు సిద్ధం చేసేలా ఆదేశాలు జారీచేశాము. ముంపు ప్రాంతాల్లోని బాధితులకు అండగా నిలుస్తాం. మళ్లీ అధికంగా వర్షం కురిస్తే సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకునేలా ఏర్పాట్లు చేశాము.

– రాణిసుష్మిత, ఆర్డీఓ, కళ్యాణదుర్గం



బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ వద్ద ప్రవహిస్తున్న వేదావతి హగరి నది



రాయదుర్గం: జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిలిచిన వర్షపు నీరు



బ్రహ్మసముద్రం: మరువ పారుతున్న భైరసముద్రం చెరువు



బ్రహ్మసముద్రం: వేపులపర్తి వద్ద ప్రవహిస్తునన్న వేదావతి హగరి నది



రాయదుర్గం: కూలిపోయిన పాలిటెక్నిక్ కళాశాల ప్రహరీ



వజ్రకరూరు మండలం జరుట్లరాంపురంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపునీరు



ముదిగల్లులో నీట మునిగిన కర్బూజా పంట

ప్రజా సమస్యలు పరిష్కరించండి

విడపనకల్లు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజాప్రతినిధులతో కలిసి పరిష్కరించాలని ఎంపీపీ కరణం పుష్పావతి అధికారులను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. తాగునీరు, వ్యవసాయం, విద్యుత్, సీజనల్ వ్యాధులపై ఆయా శాఖాధికారులతో ఎంపీపీ సమీక్షించారు. వైద్య ఆరోగ్య శాఖాధికారులు ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలని ఎంపీపీ సూచించారు. ఖరీఫ్‌లో వివిధ రకాల పంటల సాగుపై రైతులకు అవగాహన కలిప్ంచాలని వ్యవసాధికారులను కోరారు. గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించాలని సభ్యులు కోరారు. బడిఈడు పిల్లలు అంతా కూడా ప్రభుత్వ పాఠశాలలో ఉండేలా చూడాలని సూచించారు. జెడ్పీటీసీ హనుమంతు, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు సునీతాబాయి, ఏఓ భాస్కర్, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.




అధికారుల పనితీరుపై ప్రశ్నిస్తున్న ఎంపీపీ కరణం పుష్పావతి

కోల్‌కతా ఘటనపై నిరసన

రాయదుర్గంటౌన్: కోల్‌కతా ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు పాల్పడిన వారికి ఉరిశిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, మున్సిపల్ వర్కలర్లు, కళాశాల విద్యార్థులు నిరసన తెలిపారు. బుధవారం సాయంత్రం పట్టణంలో నిరసన ర్యాలీ చేసి ఏరియా ఆస్పత్రి వద్ద కొవ్వుత్తులతో ప్రదర్శన చేసి వైద్యురాలి మృతికి నివాళులర్పించారు.



కొవ్వుత్తులతో నిరసన తెలుపుతున్న మహిళలు



కొండను కప్పేసిన పొగ మంచు

రాయదుర్గంటౌన్: పట్టణానికి ఆనుకున్న ఉన్న కొండను పొగ మంచు కప్పేసింది. మూడు రోజుల నుంచి భారీ వర్షాలు, మరోవైపు ఎండ, ఉక్కపోత కూడా ఉంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ భారీ వర్షం కురిసింది. భిన్నమైన వాతావరణ పరిస్థితుల్లో బుధవారం ఉదయం 7.30 గంటలకు కొండను పొగ మంచు కప్పేసింది.

హైవే నిర్మాణానికి సహకరించండి

రాయదుర్గం (డీ హీరేహాళ్): డీ.హీరేహాళ్ మండల కేంద్రంలో ఆగిన జాతీయ రహదారి నిర్మాణానికి భూనిర్వాసితులందరూ సహకరించాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ సూచించారు. బుధవారం ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, ఆర్ఐ రామాంజినేయులు, హైవే ఇంజనీర్లతో కలసి గ్రామస్తులతో మాట్లాడారు. ప్రధాన రహదారికి ఇరుపక్కల ఆనుకుని ఉండే దుకాణాలు, నివాస గృహాల వారు ఇప్పటికే పరిహారం అందుకున్నారని గుర్తుచేశారు. ఒకరో ఇద్దరికో పరిహారం రావాల్సి ఉన్నా ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మూడు రోజుల్లోగా ఇళ్లను ఖాళీ చేయాలని సూచించారు. ఇప్పటికే రహదారి నిర్మాణం ఆలస్యమైందని, 150ఏ నుంచి కిలోమీటర్ వరకూ దారి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఎలాంటి ఆటంకం కలిగించకుండా కట్టడాలు తొలగించేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



భూనిర్వాసితులతో మాట్లాడుతున్న అధికారులు

కబడ్డీ పోటీల విజేత 'బొల్లనగుడ్డం'

బొమ్మనహాళ్: మండలంలోని బొల్లనగుడ్డం గ్రామంలో కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. వివిధ గ్రామాల నుంచి 26 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. బొల్లనగుడ్డం జట్టు విజేతగా గెలువగా వారికి రూ. 6,116 నగదు, ట్రోఫీని అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన కల్లుహోళ జట్టుకు రూ. 3,116లు నగదు, ట్రోఫీని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాదిలింగ, ఎంపీటీసీ వంశీ, కోత్తపల్లి మహేంద్ర, మాజీ ఎంపీటీసీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వజ్రకరూరు: ప్రతి విద్యార్థి గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచు మోనాలిసా, ఎంఈఓ ఎర్రిస్వామి సూచించారు. బుధవారం స్థానిక కేవీజెడ్పీ ఉన్నత పాఠశాలలో పాఠశాల గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంఈఓ, పాఠశాల హెచ్ఎం స్వర్ణలత, సర్పంచు మోనాలిసా తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఫిజియోథెరపీతో ఆరోగ్యం

కూడేరు: ఫిజియోథెరపీ చేయించుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండొచ్చని ఫిజియోథెరిపిస్టు డాక్టర్ ఎర్రిస్వామి తెలిపారు.బుధవారం కూడేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో ఉచిత ఫిజియోథెరపీ నిర్వహించారు. క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేస్తే ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతుందని ఆయన తెలియజేశారు. ఇంటి వద్ద కూడా ఫిజియోథెరపీ ఎలా చేయాలో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ రాము, హెచ్ఎం శ్రీదేవి, ఐఈఆర్టీలు మస్తానయ్య, లక్ష్మీనారాయణ, సీఆర్పీ శివ తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

శెట్టూరు: మండలంలోని ములకలేడు, అనుంపల్లి గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న హార్టికల్చర్ అధికారిణి గౌసీయా బేగం బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ములకలేడులో వర్షానికి దెబ్బతిన్న మిరప, టమాట, అనుంపల్లిలో టమాట, మామిడి తదితర పంటలను రైతులతో కలిసి పరిశీలించారు. రైతులకు కలిగిన నష్టాన్ని అంచనా వేశారు.

గెస్ట్ అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బొమ్మనహాళ్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ అధ్యాపక పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంఏ పోలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మిన్‌స్ట్రేషన్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. నెలకు రూ.10 వేలు వేతనం ఉంటుందన్నారు. 23వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోగా ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలకు రావాలన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

బొమ్మనహాళ్: వెలుగు 2024–25 వార్షిక మహాసభలను జయప్రదం చేయాలని వెలుగు రాయదుర్గం ఏరియా కోఆర్డినేటర్ గంగాధర అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెలుగు సీసీలు , ఏపీఎంలు బాధ్యత వహించి మహాసభలు నిర్వహించాలని సూచించారు. సభ్యులందరికీ సమాచారం అందించి మహాసభలను జయప్రదం చేయాలన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

విడపనకల్లు: ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూడ్ కేశవనాయక్ జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కోరారు. ఈమేరకు బుధవారం అనంతపురంలో నిర్వహించిన ఎస్టీ, ఎస్సీ గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

'సర్దుబాటు' మండలానికే పరిమితం చేయాలి

కూడేరు: ఉపాధ్యాయ సర్దుబాటు ప్రక్రియను మండలానికే పరిమితం చేయాలని ఏపీటీఎఫ్ మండల నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం వారు కూడేరులో విలేకరులతో మాట్లాడారు. క్వాలిఫైడ్ ఎస్జీటీలకు ఇష్టం లేకున్నా బలవంతంగా ఉన్నత పాఠశాలకు కేటాయించడం సరికాదన్నారు. సర్దుబాటు విషయంలో వారి ఐచ్ఛికాన్ని పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరారు. అదనంగా ఉన్న ఎంటీఎస్‌లను అదే మండలంలోనే సర్దుబాటు చేయాలని అడవిరాజు, మరికొందరు సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు.